'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

అమరులకు అచ్చమైన దృశ్య నీరాజనం!

సాధారణంగా అత్యధిక ప్రేక్షకులకు పూర్తిస్థాయి కథాచిత్రాలంటే ఎక్కువ ఆసక్తి ఉంటుంది. ఆ సినిమాలకే పాపులారిటీ, క్రేజ్ ఎక్కువ. అయితే మన జీవితాన్ని, మన సామూహిక ఆకాంక్షలను ప్రతిబింబించిన కొన్ని నాన్‌ఫీచర్ ఫిల్మ్‌లు కూడా అంతే ఆసక్తిని రేకెత్తిస్తాయి. ఫీచర్ ఫిల్మ్‌లు, ప్రధానంగా కాల్పనికతకు, ఊహాశక్తికి, సౌందర్యాత్మకతకు అద్దం పడితే, నాన్ ఫీచర్ ఫిల్మ్‌లైన డాక్యుమెంటరీలు వాస్తవికతకు, నిజ జీవిత గాథలకు, గతించిన అంశాలకు సాక్షిగా నిలుస్తాయి. రేపటి భవిష్యత్తుకు కర్తవ్య బోధ చేస్తాయి. అందుకే దూరదర్శన్, హిస్టరీ, నేషనల్ జాగ్రఫిక్, డిస్కవరీ, యానిమల్ ప్లానెట్ వంటి చానెళ్లకు కూడా ప్రధాన స్రవంతి ప్రేక్షకులకు సమానమైన సంఖ్యలో ప్రేక్షకులుంటున్నారు. 2022 ఆస్కార్‌ను గెల్చుకున్న ఎలిఫెంట్ విస్పరర్స్ డాక్యుమెంటరీ అందుకు తాజా ఉదాహరణ.

మామిడి హరికృష్ణ
80080 05231

తెలంగాణ అనే మహోన్నత లక్ష్య సాధన కోసం తమ బతుకులకు ఫుల్‌స్టాప్ పెట్టి గమ్యాన్ని ముద్దాడేదాకా ఉద్యమాన్ని నాన్‌స్టాప్‌గా నడిపించారు. అలాంటి అమరవీరులపై అమరుల త్యాగాలపై తెలంగాణ ఉద్యమ ప్రస్థానం నేపథ్యంలో 'అమరజ్యోతికి అభివందనం' అనే టైటిల్‌తో ఒక డాక్యుమెంటరీని రూపొందించడం విశేషం.

నాలుగు కోట్ల మంది ప్రజల ఆకాంక్ష! ఆత్మగౌరవం కోసం, అస్తిత్వం కోసం సామాన్య ప్రజలందరు చేసిన సామూహిక ఆక్రందన! హృదయమున్నా స్పందించని, చెవులున్నా వినపడని, కళ్లున్నా చూడలేని వ్యవస్థపై సామాన్య ప్రజల ధిక్కారస్వరం తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం!

నిజానికి 'తెలంగాణ' అనే పేరులోనే ఓ వైబ్రేషన్ ఉంది! ఒక ఉత్తేజం ఉంది! ఒక నిత్యజ్వలిత ఉద్వేగం, నిరంతర ఉల్లాసం ఈ నేల పొరల్లో నిక్షిప్తమై ఉంది! అవమానాలు, అసమానతలు, వివక్ష ఫలితంగా నిధులు, నీళ్లు, నియామకాల పరంగా వెనుకబాటుతనాన్ని, పూర్తి నిర్లక్ష్యాన్ని పొందిన నేలమీద పుట్టిన ప్రజల పొలికేక తెలంగాణ ఉద్యమకాంక్ష గా పరిణమించింది. అలాంటి తెలంగాణ ఉద్యమం మిలియన్ మార్చ్‌గా, సకల జనుల సమ్మెగా ఎన్నెన్నో పోరాట రూపాలలో ప్రజాకాంక్షను వ్యక్తం చేసింది. రాజ్యాంగ పరిధిలో ప్రజా పోరాట వేదికలో, ఎన్నికల బరిలో నిలిచి గెలిచిన జెండాగా సైతం నిత్యం ప్రజలందరి ఆకాంక్షకు నిలువెత్తు నిదర్శనంగా కొనసాగింది.

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారు అమరవీరుల స్మారకం అమర జ్యోతి ప్రారంభించే క్రమంలో ప్రత్యేకంగా ఒక డాక్యుమెంటరీని రూపొందించాలని ఆదేశించారు. దానిని అనుసరిం చి దేశపతి శ్రీనివాస్ పర్యవేక్షణలో రూపొందిన ఈ డాక్యుమెంటరీ నిడివి 10.15 నిమిషాలు అయినప్పటికీ మొత్తం 25 ఏండ్ల ప్రస్థానాన్ని దృశ్యమానం చేసింది.

> 14 ఏండ్ల పోరాటం, ఆ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు, తెలంగాణేతరుల దాష్టీకాలు స్పృశిస్తూనే మరొకవైపున శ్రీకాంతాచారి, యాదగిరి లాంటి యువ వీరుల బలిదానాలను ఎంతో హృద్యంగా ఆవిష్కరించి కంటతడి పెట్టించింది. ఉద్యమ ప్రస్థానంలో అమరుల బలిదానాలు అన్నింటినీ చెబుతూ కొట్టాడి తెచ్చుకున్న తెలంగాణ వికాస సంక్షేమాల కొనసాగింపు కోసం భవిష్యత్తులో మన భాధ్యతను మరింత గుర్తు చేసింది.

సహృదయ వ్యాఖ్యానంగా, సంవేదనతో కూడిన ఆత్మీయ స్పర్శగా మరొక్కసారి అమరవీరుల త్యాగాలని గుర్తు చేసుకొని, మనందరం పునరంకితం కావలసిన అవసరాన్ని గుర్తించేలా రూపొందించిన ఈ డాక్యుమెంటరీ అనుకున్న లక్ష్యాన్ని సాధించింది. ఒక సామూహిక స్వప్నం కోసం నెత్తురు ధారపోసిన నేల ఇది... అనే గంభీర స్వరంతో కూడిన వ్యాఖ్యానంతో, రక్తమోడుతున్న అమరవీరుల స్తూపం దృశ్యంతో, ఉరుములు, మెరుపులు మానవ నిస్సహాయ ఆక్రందనల బ్యాక్‌గ్రౌండ్ సంగీతంతో ఒక భావోద్విగ్న లోకంలోకి తీసుకెళ్లిన ఈ డాక్యుమెంటరీ, ఇది తెలంగాణం...

చరిత్ర పుటలపై ఎగిసిపడిన ఆరు దశాబ్దాల అత్మగౌరవ రణం అంటూ, 1969 తొలిదశ ఉద్యమ అనంతరం చరిత్ర చెమ్మగిల్లిన కన్నులతో మరో విస్ఫోటనం కోసం ఎదురు చూసింది అని మలిదశ ఉద్యమానికి కారణాన్ని చూపింది.

ఆద్యంతం ఎంతో ఉద్వేగభరితంగా కొనసాగిన ఈ డాక్యుమెంటరీలో తెలంగాణ ఉద్యమ ఘట్టాలలోని సందర్భోచితమైన విజువల్స్, జోహారులు... జోహారులు... అమరులకూ జోహార్ అనే నందిని సిధారెడ్డి పాటలోని భాగాలు గుండెల్లో ప్రకంపనలు పుట్టిస్తాయి. 'ఓ అమరులారా... మీ కన్నుల కాంతులే స్వరాష్ట్ర ప్రగతిలో ప్రతిఫలిస్తున్నాయి... సంక్షేమంలో అభివృద్ధిలో సువర్ణాధ్యాయాన్ని లిఖిస్తున్నాయి' అని నవశకానికి నాంది పలికిన తీరును ఆవిష్కరించింది. గోదారమ్మ హోరులో, కృష్ణమ్మ జోరులో అమరుల చిరునవ్వుల సవ్వడులను, మత్తడి దుంకుతున్న చెరువుల అలలలో అమరుల కలలను చూస్తున్నామని చెప్తూ, తెలంగాణా దశాబ్ది సందర్భంలో అమరవీరులు పంటచేలలో పసిపాపలుగా, తలలో పాల బువ్వలుగా, బతుకమ్మకు శిఖరంగా, పాలపిట్టలుగా దర్శనమిస్తున్నారని ఎంతో హృద్యంగా ఈ డాక్యుమెంటరీ సమకాలీన ప్రగతితో సమన్వయం చేస్తూ కీర్తించింది. ఇలా పదం, వ్యాఖ్యానం, దృశ్యం, సంగీతం ఒకదానితో ఒకటి మమేకమై తెలంగాణా భావోద్విగ్నత అంతస్సూత్రంగా కొనసాగిన ఈ డాక్యుమెంటరీ ఏ అంతర్జాతీయ డాక్యుమెంటరీకి తక్కువ కానంత ఉన్నత ప్రమాణాలతో రూపొందింది.

> అసాధ్యం అనుకున్న తెలంగాణా ఆవిర్భవించి దశాబ్దకాలం పూర్తి చేసుకున్న ప్రస్తుత తరుణం నాటికి తెలంగాణా అభివృద్ధి, సంక్షేమ రంగాలలో అనూహ్య ప్రగతిని సాధించడమే కాక, దేశానికే ఆదర్శంగా నిలిచే స్థాయికి వెళ్లింది. ఆర్థిక ప్రగతికి కొలమానమైన తలసరి ఆదాయంలో దేశంలోనే నెంబర్‌వన్ స్థానాన్ని సాధించి అమరవీరులు కన్నకలలను సాకారం చేసింది.

యంగ్ రాష్ట్రం... ఎన్నో కలలు... మరెన్నో సవాళ్ళు... ఇంకెన్నో ప్రతిబంధకాలు... అన్నిటినీ అధిగమించి తెలంగాణా సతత హరితంగా, సుజల సుఫలంగా, సమాచార సాంకేతికంగా, వైద్య ఆరోగ్య విద్యాపరంగా, సాంస్కృతిక, సాహిత్య, కళారంగాలపరంగా, సుపరిపాలనలో అనన్యసామాన్యమైన పురోగతిని సాధించింది.

ఈ సాధన వెనుక ప్రతీక్షణం స్ఫూర్తిగా నిలిచింది తెలంగాణా పోరాటమే! ఈ విజయాల వెనుక ప్రతీ నిమిషం ప్రేరణను ఇచ్చింది తెలంగాణా పోరాట వీరులే!! అనే భావనను సున్నితంగా, సునిశితంగా, ఉద్వేగభరితంగా ఈ డాక్యుమెంటరీ అందించింది.

సాధారణంగా డాక్యుమెంటరీలు, రియలిస్టిక్ కథనాలతో దానికి సంబంధించిన ఛాయాచిత్రాలతో విజువల్ ఫుటేజ్‌తో ఉండడం సహజమే, ఈ డాక్యుమెంటరీ కూడా అదే సూత్రాన్ని పాటించింది అయితే దీనిలోని రచన, వ్యాఖ్యానం హృదయాన్ని తట్టిలేపుతూ, తెలంగాణ మట్టి తత్వాన్ని మరొక్కసారి ప్రేక్షకులందరికీ జ్ఞప్తి చేస్తుంది. తెలంగాణ ఆత్మ తత్వాన్ని, పోరాటపటిమను, త్యాగనిరతిని గుర్తుచేస్తుంది. ఈ డాక్యుమెంటరీలోని అక్షరాల నిండా కవితాత్మకత, సాహితీ కావ్య ప్రాతిపదిక ఉండడం, ఈ డాక్యుమెంటరీ దృశ్యపరంగా ఆసాంతం వాస్తవికతని, భావాలపరంగా ఆర్ద్రతని, అక్షరాలలో ఆత్మీయతని మూటగట్టుకొని చూసిన, విన్నవారందరిలో ఒక సారి కంటతడి పెట్టించే లాగా, మరోసారి కర్తవ్యోన్ముఖులను చేసేలా ఉండడం విశేషం. సాధారణంగా ఒక సన్నివేశం ప్రేక్షకులని ప్రభావితం చేయడం సహజమే! అయితే దీనిలోని దృశ్యాలు, వ్యాఖ్యానం ప్రేక్షకులని కాలయంత్రంలో వెనక్కి తీసుకెళ్లి ఎక్కడో అట్టడుగున గుండెపొరల్లో దాగి ఉన్న భావాలను, స్మృతులను తట్టి లేపడం, ప్రభావితం చేయడం మాత్రం ఈ డాక్యుమెంటరీ ద్వారా సాధ్యమైంది. ఈ డాక్యుమెంటరీకి సందర్భోచిత గ్రాఫిక్స్, స్క్రిప్ట్, విజువల్ ఈస్తటిక్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ నాలుగు స్థంభాలుగా నిలిచి దీనిని ఎంతో హృద్యమైన, ఆత్మీయమైన సమకాలీన చారిత్రక రికార్డుగా నిలిపాయి. పదికాలాల పాటు పదిలం చేసుకోదగిన రికార్డుగా దీనిని మలచడమేకాక, తన గళాన్ని, కలాన్ని అందించి దీనికి జవజీవాలను అందించిన శాసన మండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్, సాంకేతిక సహకారం అందించిన శ్రీ పూర్ణచందర్ బాదావత్, ఇతర సాంకేతిక నిపుణుల కృషికి శనార్తులు చెప్పకుండా ఉండలేం. మొత్తం మీద ఈ 10 నిమిషాల డాక్యుమెంటరీ తెలంగాణా ప్రస్థానంపై విహంగ వీక్షణంలా కనిపించినా, 10 పూర్తిస్థాయి కథాచిత్రాలకు కావలసినంత ముడిసరుకును ఎమోషనల్‌గా అందించిందనడంలో సందేహం లేదు!

(వ్యాసకర్త : భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు)

మైనారిటీలకు అండగా..

గుండమల్ల సత్యనారాయణ
95059 98838

> తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఓబీసీ ముస్లిం మైనారిటీ కమ్యూనిటీకి 4 శాతం నుంచి 12 శాతానికి రిజర్వేషన్ పెంచుతూ రాష్ట్ర అసెంబ్లీలో చట్టాన్ని ఆమోదించింది. ఇది యావత్తు తెలంగాణ ప్రజానీకం గర్వించదగిన విషయం. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఓబీసీ ముస్లిం మైనారిటీలకు రిజర్వేషన్ శాతం పెంచి తెలంగాణ రాష్ట్రమంటే లౌకికత్వానికి నిదర్శనంగా నిలిచింది.

ఓబీసీ ముస్లిం మైనారిటీలకు రిజర్వేషన్ కల్పించడమంటే సమాజంలో సబ్బండ వర్గాల ప్రజలు సమానమని చెప్పటమే. ప్రకృతి ప్రసాదించినటువంటి ఈ భూమిపై సబ్బండ కులాలకూ, మతాలకూ రాజ్యాధికారంలో సమానమైన అవకాశాలు కల్పించినప్పుడే భారతీయ లౌకికత్వానికి నిజమైన అర్థం. రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసిన ఓబీసీ మైనారిటీ రిజర్వేషన్ల తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి వారికి రిజర్వేషన్లు కల్పించాలి. లేనిపక్షంలో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను పెంచుకునే హక్కును రాష్ట్రాలకు అప్పజెప్పాలి. గతంలో తెలంగాణ రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర హోంమంత్రి ఓబీసీ ముస్లింలకు హక్కుగా ఉన్న రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పడం ఈ దేశ లౌకిక చరిత్రను కించపర్చడమే.

ఈ దేశంలో పుట్టిన ప్రతి పౌరున్ని సమానంగా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యత. గతంలో తెలంగాణ నుంచి వలసలు ఉండేవి. ఈ వలసల్లో అక్షరాస్యులైన వారు ఉత్తర అమెరికాలోని కెనడా, అమెరికాకు, యూరప్ దేశాల్లోని బ్రిటన్‌కు వెళ్లేవారు. నిరక్షరాస్యులైన మన యువకులు ముస్లిం దేశాలల్లోని దుబాయ్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇరాన్, ఇరాక్ లకు వలస వెళ్లేవారు. ఆధునిక కాలానికి సంబంధించిన పారిశ్రామిక పనులు తెలియని చాలామంది ముస్లిం దేశాలకు వలస వెళ్లేవారు. ఆ దేశాల్లో ముస్లింలు ఇండియా నుంచి వలసలు వెళ్లేవారికి రకరకాల పనులు కల్పించి అక్కున చేర్చుకున్నారు. అలాంటపుడు మనం ఇక్కడున్న ముస్లిం సోదరులను అక్కున చేర్చుకోలేమా! 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఉండరాదని ఓబీసీ రిజర్వేషన్లను అడ్డుకోవాలని చూస్తున్నది కేంద్ర ప్రభుత్వం. రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదనే సుప్రీంకోర్టు తీర్పులు తెలంగాణ సామాజిక జీవనవిధానానికి సరైనవి కావు. ఎందుకంటే తెలంగాణలో నూటికి తొంభై శాతం ప్రజలు షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, ఓబీసీ, మైనారిటీ కమ్యూనిటీలు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వం అక్రమంగా తీసుకొచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కోటాలో అగ్రకులాలకు తప్ప మరే ఇతర సామాజిక వర్గానికి అందులో ప్రాతినిధ్యం కల్పించలేదు. ఈ దేశంలో ఆర్థిక వెనుకబాటుతనమంటే కేవలం అగ్రకులాల వారికి మాత్రమే వర్తిస్తుందా. ఆర్థిక వెనుకబాటు కారణం చెబుతూ తీసుకొచ్చిన ఈడబ్ల్యూఎస్ పది శాతం రిజర్వేషన్లలో ఆర్థిక వెనుకబాటుతనం కల్గిన ప్రతి సామాజిక వర్గానికి అందులో ప్రాతినిధ్యం కల్పించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఓబీసీ ముస్లిం మైనారిటీలకు రిజర్వేషన్ల శాతాన్ని పెంచిన డిమాండును కేంద్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి.! ఈ దేశ పరిపాలన కోసం రాజ్యాంగాన్ని నిర్మించుకోవడానికి వేసిన రచన కమిటీలో ముస్లిం కమ్యూనిటీకి చెందిన మేధావుల శ్రమ కూడా ఉన్నదనే విషయాన్ని ఈదేశ పాలకులు గుర్తించాలి. ఈరోజు శత్రు దేశాలకు సవాలుగా తలెత్తి నిలబడ్డామంటే ఈ దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసి అణుబాంబుల సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించిన మేధావి అబ్దుల్ కలాం కూడా ఇదే సామాజిక వర్గమని భారతీయులుగా మనం మరువరాదు.

మోదీ గురివింద నీతులు!

> పరివార్ పాలిటిక్స్‌పై పదే పదే మాట్లాడటం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఒక అబద్ధాల ఆటవిడుపు. ఆగష్టు 15న ఏర్రకోట నుంచి జాతినుద్దేశించి ప్రసంగించినా, తన కార్యకర్తల సంకల్ప సమావేశాల్లో మాట్లాడిన, భారత ప్రజల అత్యంత గౌరవ ఆలయం పార్లమెంటులో మాట్లాడినా మోదీ పరివార్ పాలిటిక్స్, కుటుంబ పాలనపై కథలుగా చెప్పి ప్రజలను మోసం చేయడంలో భేతాళుడినే మించిపోయిండనటంలో సందేహం లేదు.

బండారు జితేందర్
93912 94127

పరివార్ పాలిటిక్స్‌పై పదేండ్లుగా చెప్తూ.. దేశాభివృద్ధి గురించి ప్రజలు ఆలోచించకుండా చేయడంలో నరేంద్రమోదీ విజయవంతమయ్యాడనేది విశ్లేషకుల మాట. మరీ నిజంగా కుటుంబ పాలన, పరివార్ పాలిటిక్స్ పై ప్రధానికి చిత్తశుద్ధి ఉన్నదా? వాళ్ల పార్టీ బీజేపీలో వారసులకు అవకాశాలు ఇవ్వలేదా? అనే అంశాలపై అనేక ప్రశ్నలు ఉన్నాయి. వాటికి ఆధారపూరితమైన సాక్ష్యాలూ ఉన్నాయి.

వారసులకు రాజకీయ పదవులపై ప్రధాని పలుమార్లు చెప్పే మాటలు, నీతి సూత్రాలు అన్నీ అబద్ధాలేనని స్పష్టమవుతున్నది. అనేక రాష్ట్రాల్లో బీజేపీలో వారసులకే టికెట్లు ఇస్తున్నారు కదా? మోదీ సొంత మంత్రివర్గంలో రాజకీయ వారసులకు కూడా అవకాశాలు కల్పించారనేది బహిరంగమే కదా? ఇవన్నీ చెప్పకుండా కుటుంబ పాలన నే అభివృద్ధికి అడ్డమని చెప్పడం ఏ రాజనీతికి నిదర్శనం? ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో అదే పార్టీకి చెంది న రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కొడుకు పంకజ్ సింగ్ బీజేపీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. యూపీ మాజీ సీఎం కళ్యాణ్ సింగ్ వారసుడు రాజ్‌వీర్ సింగ్ ఎంపీ కాదా? రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలను రాజకీయ వారసులుగా విమర్శిస్తారు కదా? మేనకాగాంధీ, వరుణ్ గాంధీలకు టికెట్లు ఇచ్చింది బీజేపీనే కదా? లైంగిక వేధింపుల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ కొడుకు ప్రతీక్ భూషణ్ బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్నది వాస్తవమే కదా! దీనిమీద మోదీ ఎందుకు మాట్లాడరు? హిమాచల్ ప్రదేశ్ మాజీ సీఎం ప్రేమ్ కుమార్ ధుమాల్ కొడుకు అనురాగ్ ఠాకూర్ కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నాడు. అనురాగ్ ఠాకూర్ బీజేపీ వారసత్వ రాజకీయాలతోనే కేంద్రమంత్రి అయ్యాడనేది ప్రధానికి తెలియని విషయమా? ఒడిశాకు చెందిన దేవేంద్ర ప్రధాన్ వాజ్‌పేయ్ ప్రభుత్వంలో మంత్రి. ఆయన కుమారుడే ధర్మేంద్ర ప్రధాన్, ఆయనే ప్రస్తుతం కేంద్ర విద్యాశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. ఆయనకు రాజ్యసభ సీటు ఇచ్చి కేంద్రమంత్రి పదవి ఇచ్చిం ది ఏవరు? ధర్మేంద్ర ప్రధాన్ పాలిటిక్స్‌లో ఎదిగింది వారసుడిగా కాదా? అనేది బీజేపీ ప్రశ్నించుకోవాలి.

> బీహార్‌లో లాలూ ప్రసాద్ కుటుంబం మాత్ర మే వారసత్వ రాజకీయాలు చేస్తున్నట్టు ఎప్పుడూ ప్రధాని చెప్తుంటారు. కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ ఎవరు? ఆయన తండ్రి ఠాగూర్ ప్రసాద్ జనసంఘ్ ఫౌండర్ మెంబర్స్‌లో ఒకరు అనేది వాస్తవం కాదా? ఆ మూలాల వల్లనే రవిశంకర్ ప్రసాద్ కేంద్రమంత్రి అయ్యిండన్న విషయం ప్రజలకు తెలువకుండా ఎన్ని రోజులు మోసం చేస్తారు.

బీహార్‌కు చెందిన యశ్వంత్ సిన్హా కొడుకు జయేష్ సిన్హా జార్ఖండ్ నుంచి ఎంపీగా గెలిచి, ప్రధాని అనుగ్రహంతోనే కేంద్రసహాయమంత్రిగా పనిచేశాడని ఒప్పుకోవాలి. మహారాష్ట్ర మాజీ సీఎం, ప్రస్తుత డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ కూడా రాజకీయ వారసుడనేది అందరికీ తెలిసిందే. ఆయన తండ్రి ఎమ్మెల్సీగా పనిచేశారు. మరో కేంద్రమంత్రి పీయూష్ గోయల్ తల్లిదండ్రులు ఇద్దరూ కూడా బీజేపీనే కదా. ఆయన తండ్రి దేవ్ ప్రకాష్ గోయల్ వాజ్‌పేయ్ ప్రభుత్వంలో కేంద్రమంత్రిగా పనిచేశాడని చరిత్ర నే చెబుతుంది. తల్లి చంద్రకాంత గోయల్ మూడు సార్లు బీజేపీ ఎమ్మెల్యేగా పనిచేసింది కూడా. మరి పీయూష్ గోయల్ రాజకీయ వారసుడు కాదని ప్రధాని ఒప్పుకుంటాడా?

రాజస్థాన్‌లో రెండుసార్లు బీజేపీ నుంచి సీఎంగా పనిచేసిన వసుంధరా రాజే సింధియా స్వయంగా గ్వాలియర్ రాజ కుటుంబానికి చెంది న రాజకీయ వారసురాలని లోకమంతా తెలుసు కదా? ఆమె కొడుకు దుష్యత్ సింగ్ నాలుగుసార్లు బీజేపీ ఎంపీగా ఉన్నాడు. అదే రాజ కుటుంబానికి చెందిన జ్యోతిరాదిత్య సింధియాను పార్టీలో చేర్చుకొని కేంద్రమంత్రి పదవి ఇచ్చింది కూడా మోదీ అన్న విషయం ఈ తరం వాళ్లకు తెలిసిందే కదా? గుజరాత్ అమిత్ షా కొడుకు జయ్ షా 34 ఏండ్ల వయసులో బీసీసీఐ సెక్రటరీ స్థాయికి ఎట్లా ఎదిగారనే విషయంపై మోదీనే సమాధానం చెప్పాలి. అదే జయ్ షా ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఎలా అయ్యారు? దాని వెనుక వారసత్వ రాజకీయాలు లేవా? మోదీ ఆశీస్సులతో అమిత్ షా కేంద్ర హోంమంత్రి అయితే.. ఆయన వారసత్వానికి కొనసాగింపుగానే జయ్‌షా బీసీసీఐ సెక్రటరీ అయ్యిండని అందరికీ తెలిసిందే.

మొన్నటిదాకా కర్ణాటక సీఎంగా ఉన్న బసవరాజ్ బొమ్మై వాళ్ల నాన్న ఎస్ఆర్ బొమ్మై కర్ణాటక సీఎంగా, కేంద్రమంత్రిగా పనిచేశారు. బొమ్మై ప్రధాని దృష్టిలో రాజకీయ వారసుడు కాదంటే ఎలా? యడియూరప్ప ఇద్దరు కొడుకుల్లో ఒకరు ఎమ్మెల్యే, ఇంకో కొడుకు ఎంపీ. వాళ్లవి వారసత్వ రాజకీయాలు కావని ప్రధాని మోదీ నిరూపించగలరా? అరుణాచల్‌ప్రదేశ్ మొట్టమొదటి ప్రొటెం స్పీకర్ రిచ్చిన్ కారర్ రిజిజు కొడుకు కిరణ్ రిజిజు కేంద్రమంత్రిగా ఉన్నాడు. ఆయన కూడా రాజకీయ వారసుడు కాదా? ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఎవరు? ఎన్టీఆర్ కూతురు కాదా? ఇదీ వారసత్వ రాజకీయం కాదా? చివరకు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ డీ శ్రీనివాస్ కొడుకు కాదా.. ఇదీ వారసత్వం కాదా? ఇలా అనేక అంశాల్లో బీజేపీలో వారసత్వ రాజకీయాలు స్పష్టంగా కనిపిస్తాయి.

దేశంలోని కుటుంబ పాలన గురించి చెప్పే మోదీ తన పార్టీలో ఉన్న కుటుంబ పాలనపై మాత్రం మాట్లాడడు. తొమ్మిదేండ్లలో ప్రధాని నరేంద్రమోదీ కుటుంబ రాజకీయాలపై తన పార్టీలో చర్యలు ఏమైనా తీసుకున్నారా ప్రజలకు సమాధానం చెప్పాలి. బీజేపీ ప్రధాన ప్రచార అస్త్రాలు అవే అయినప్పుడు తన సొంత పార్టీలో కుటుంబ పాలన, వారసత్వ రాజకీయాలు, వారసులపై ప్రధాని మోదీ చర్యలు తీసుకుంటే..ప్రజలు కూడా హర్షిస్తారు. అట్లా కాకుండా రాజకీయాల కోసం తియ్యగా అబద్ధాలు చెప్పడం, యతిప్రాసల కోసం పరివార్ పాలిటిక్స్ గురించి అనర్గళంగా మాట్లాడటాన్ని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు.

ఎటమటం

మల్కాజ్‌గిరి డిక్లరేషన్

కాంగ్రెస్ పార్టీలో ఉదయపూర్ డిక్లరేషన్‌కు కాలం చెల్లింది. తాజాగా మల్కాజ్‌గిరి డిక్లరేషన్ అమలు జరుగుతోంది. తాజా డిక్లరేషన్ ప్రకారం ఫ్యామిలీ ప్యాక్ కింద తండ్రి-కొడుకు టికెట్ పొందే వెసులుబాటు లభించింది. కాంగ్రెస్ సీనియర్ నాయకులు తమ రాజకీయ వారసుల టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఎలక్షన్ స్క్రీనింగ్ కమిటీ మాత్రం ఉదయపూర్ డిక్లరేషన్ ప్రకారం ఒక నాయకుడికి ఒకటే టికెట్ ఇస్తామని మిగతా వాటిని తిరస్కరించారు. ఉదయపూర్ డిక్లరేషన్ ప్రకారం ఒకటే టికెట్ ఇస్తారన్న విషయం తమకు కూడా తెలుసు కానీ మల్కాజ్‌గిరి డిక్లరేషన్ ప్రకారం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మైనంపల్లి హనుమంతరావు, ఆయన కుమారుడికి టికెట్ ఇచ్చారు కదా? తమ పరివారానికి కూడా మల్కాజ్‌గిరి డిక్లరేషన్ ప్రకారం టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మెల్యేలకు ఎర కమిటీ?

బీజేపీ అసంతృప్తి నాయకుల బుజ్జగింపునకు పార్టీ బైలాలో లేని, కొత్త కొత్త పోస్టులను సృష్టించి కట్టబెట్టింది. ఈ కమిటీలను వేయడానికి కసరత్తు బాగానే చేసినట్టుందని పార్టీ నేతలు కితాబు ఇస్తున్నారు. విజయశాంతికి పోరాట కమిటీ చైర్మన్ పదవి ఇవ్వడం సముచిత నిర్ణయమని అంటున్నారు. సందర్భం వచ్చినప్పుడల్లా పార్టీకి వ్యతిరేకంగా విజయశాంతి గళం విప్పుతున్నారు. అయితే పదవులు పొందిన నేతలు ఎవరు కూడా సంతృప్తి చెందడం లేదు. దమ్మిడి ఆమ్‌దాని లేని ఈ పోస్టుల కంటే 'ఎమ్మెల్యేలకు ఎర' కమి టీ ఇచ్చి ఉంటే అంతో ఇంతో గిట్టుబాటు అయ్యేదని అంటున్నారు.

పెద్దలు రేవంత్‌రెడ్డా?

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జానారెడ్డిని 'పెద్దలు జానారెడ్డి' అంటూ అందరూ గౌరవంగా సంబోధించేవారు. పార్టీలో ఇటీవల ఆయనకు పలుకుబడి తగ్గడంతో తన రాజకీయ వారసులుగా కుమారుల్ని రంగంలోకి దింపారు. అయితే 'పెద్దలు జానారెడ్డి' అనే బిరుదును కూడా లాగేసుకోవడం పట్ల ఆయన అభిమానులు జీర్ణించుకోలేక పోతున్నారు. కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న మైనంపల్లి హనుమంతరావు తన ప్రసంగంలో 'పెద్దలు రేవంత్‌రెడ్డి' అని సంబోధిస్తున్నారు. పార్టీకి కొత్త అయినంత మాత్రాన జానారెడ్డికి ఉన్న బిరుదును రేవంత్‌రెడ్డికి తగిలించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.



ఐదుకే దిక్కు లేదు...ఆరా?

కన్నతల్లికి తిండి పెట్టనోడు పినతల్లికి బంగారు గాజులు చేయిస్తానని అన్నాడంట ఒకడు. ఆ ఒకడో ఎందుకు తమ పార్టీ పరిస్థితి కూడా అలాగే ఉందని కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరు వాపోయారు. తమ రాష్ట్రంలో ప్రకటించిన ఐదు గ్యారంటీలకే దిక్కు లేదు...తెలంగాణలో ఆరు గ్యారంటీ పథకాలు ఎక్కడి నుంచి ఇస్తారని కాంగ్రెస్ ఎమ్మెల్యే షడాక్షరి ఉన్నది ఉన్నట్టు కుండబద్ధలు కొట్టినట్టు ప్రశ్నించడం హాట్ టాపిక్‌గా మారింది. ప్రత్యర్థులకు బలమైన అస్త్రాన్ని అందించినట్టయింది. దీంతో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు తలలు పట్టుకుంటున్నారు.

-వెల్జాల